# నమ్మకం అపనమ్మకం

తలుపులు తీసి వున్నప్పటికీ నా ఇంట్లోకి నేను ప్రవేశించలేని స్థితిలో ఉన్నాను. కాలింగ్‌బెల్ నొక్కాను. తక్షణం నా పార్వతి ప్రత్యక్షం. 'ఒక్క నిమిషం ఆగండి' అంటూ అంతలోనే అదృశ్యం. శ్రీమతి ఆదేశం. ఒక్క నిమిషం ఏమిటి? ఎంతసేపైనా అలా నిలబడిపోవాలి.

పార్వతి పొడవాటి చేతికర్రతో వచ్చింది. అందుకు నేను భయపడలేదుగాని, ఆ కర్రపాటి విలువ నాకా సమయంలో లేదనిపించింది. కర్రతో డోర్ కర్టెన్‌ని ఒక పక్కను అదిమి పెట్టింది. ఇంట్లో ఏ గుడ్డనీ, ఏ వస్తువునీ తాకకుండా నడవమని హెచ్చరిక. జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ నడిచేను. బల్లపై చేతివాచీ, సెల్, పర్స్, మోటార్‌బైక్ తాళం చెవి, కాగితాలు వగైరాలు పెట్టి, డైరెక్టుగా బాత్‌రూమ్‌కి వెళ్ళేను. నా వంటిపై దుస్తులు సమస్తం తీసి, బకెట్‌లో వేసి నీటిలో నానబెట్టాను. వాటిని పార్వతి ఎప్పుడో ఉతుకుతుంది.

స్నానం చేసి టవల్ చుట్టుకుని బాత్రూము నుంచి బయటకు రాగానే పార్వతి లుంగీ పంచె, బనియను అందించింది. తర్వాత వేడివేడి టీ ఇచ్చింది. ఇస్తూ నాపై గట్టిగా చిరాకుపడింది.

"ఇంట్లో శుభకార్యం జరుగుతుంటే... మైలతో ఇంటికి రావడం ఏమిటండీ? మీకెన్నిసార్లు చెప్పినా మీ ధోరణి మీదే"

నాకు తెల్సి ఇంట్లో శుభకార్యాలంటూ ఏమీలేవు. ఇద్దరు కూతుళ్ళు మాకు. పెళ్ళిళ్ళు అయిపోయాయి. పెద్దపిల్ల జయ అమెరికాలో ఉంటోంది. చిన్నది గౌతమి బెంగుళూరులో ఉంటోంది.

పార్వతి దృష్టిలో శుభకార్యం అంటే ఆమె అన్నయ్య ప్రకాశం ఇంట్లో పెళ్ళి. మా ఇంటికి ఎదురిల్లే. బావమరిది ఇంట్లో పెళ్ళికి నా మైల ఏవిధంగా

ఆటంకపరుస్తుందో నాకు అర్థం కాలేదు.

ఉదయం నేను ఆఫీసుకి వెళ్ళగానే... మా కొలీగ్ చంద్రరావు కేన్సర్‌తో గతరాత్రి చనిపోయిన విషాదవార్త తెలిసింది. మా డిపార్టుమెంట్ చాలామందిమి కంపెనీ బస్‌లోనే వెళ్ళి, చంద్రరావు బాడీని చూసి, ఇంటి సభ్యులను పరామర్శించి మళ్ళీ ఆఫీసుకి వచ్చేసి ఎప్పటిలానే మా పనులు సాయంత్రం వరకూ ఆఫీసులో చేసుకున్నాం.

ఆఫీసులో లేని మైల ఇంటిదగ్గర ఎదురైంది. చావు దగ్గరకు వెళ్ళిన విషయం పార్వతికి చెప్పకుండా తిన్నగా ఇంటికి వచ్చేస్తే ఏమీలేదు. కాని పొరపాటున ఆమెకు తెలిస్తే? ఆమె సోదరుడు ప్రకాశం, నేనూ పనిచేస్తున్నది ఒకే కంపెనీలో. డిపార్టుమెంట్లు వేర్వేరు. అయినప్పటికీ ఇలాంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉంటాను. ఆఫీసు నుంచి ఇంటికి బయల్దేరే ముందు పార్వతికి ఫోన్ చేశాను. శవం వద్దకు వెళ్ళి వస్తున్న విషయం చెప్పాను. ఇంటికి రాగానే ఆమె ముందు అశుచితో నిలబడిన బాలుడినయ్యేను.

మృతాశౌచమే కాదు, జాతాశౌచం పట్ల కూడా ఒళ్ళు దగ్గర పెట్టుకుని శాస్త్ర ప్రకారం నియమాలను పాటిస్తుంది. మైలరోజుల్లో దేవుడి గదిలో దీపం పెట్టదు. పూజలు ఉండవు. చలికాలమైనా సరే చన్నీళ్ళతో స్నానం తప్పదు. కటికనేలపై నిద్ర తప్పదు. తనేకాదు, నేనూ పిల్లలూ కూడా.

'చలికాలంలో చచ్చి మమ్మల్ని చంపకండిరా దేవుడోయ్' అని ఏడ్చేది చిన్నప్పుడు మా గౌతమి. పిల్లలే కదా అని చూసీ చూడనట్లు వ్యవహరించేది కాదు పార్వతి.

మైల విషయం పార్వతి ఎంత సీరియస్‌గా ఫాలో అవుతుందో అనేదానికి ఈ మధ్యే చనిపోయిన ఆమె మేనమామ గురించి చెప్పుకోవాలి.

మేనమామ సత్యం అంటే ఎంతో అభిమానం పార్వతికి. ఆయన చనిపోతే ఇంటిదగ్గరే రేయింబవళ్ళు ఏడ్చిందిగాని శవాన్ని చూడటానికి వెళ్ళలేదు. చివరి చూపు చూడటానికి సాహసించలేదు. పోనీ పెద్దకర్మకూ వెళ్ళలేదు. నన్ను కూడా వెళ్ళనీయలేదు. మేనమామ కుటుంబం ఎక్కడో, ఏ అండమాన్‌లోనో లేదు, కిలోమీటరు దూరంలో ఈ ఊళ్ళోనే ఉన్నారు. ఇంటివద్దే రెండు రాత్రులు, మూడు పగలు చన్నీళ్ళు, నేలనిద్రతో మైల పాటించింది గాని కనీసం మేనమామ కుటుంబ సభ్యులను ఫోన్‌లోనైనా పరామర్శించలేదు.

పార్వతి ప్రవర్తన నాకు అర్థంకాక అడిగితే –

"అయ్యో! నేను వెళ్ళకూడదండీ. అందరికీ తెలిసిన విషయాలు కూడా మీకు అర్థం కావు. మనం ఈ మధ్యనే గౌతమికి పెళ్ళి చేశాం అవునా! కన్యాదానం చేశాక ఎంతటి ఆప్తులు పోయినా చావు ఇంటికి కనీసం ఆరు నెలలు వరకూ వెళ్ళకూడదు. వెళితే కీడు సంభవిస్తుంది. మా అన్నయ్య కూడా అదే మాట చెప్పాడు. నేను రాలేని పరిస్థితిని అన్నయ్య వాళ్ళకి చెప్పాడు. అందరూ అర్థం చేసుకున్నారు. అర్థం కానిది మీకే" అంది పార్వతి.

అవును. అర్థం కానిది నాకే. కొన్ని సందర్భాలలో నన్ను నేను క్షమించేసు కుంటాను. నాలో నేను రాజీపడి పోతాను. సహనంతో సర్దుకుపోతాను. ఆమె నమ్మకాలను కిక్కురుమనకుండా ఆచరిస్తాను. నా అయిష్టతని కనబరచకుండా తను ఏది చెబితే అది చేస్తాను.

ఇలాంటి చిన్న చిన్న ఇబ్బందులున్నప్పటికీ, పార్వతిని పెళ్ళి చేసుకున్నందుకు నేను ఏనాడూ బాధ పడినట్టు గుర్తులేదు. ప్రకాశం తన చెల్లెల్ని నాకు బలవంతంగా అంటగట్టేడు అని ఇప్పటికీ నేను భావించడం లేదు.

ప్రకాశం నేనంటే ప్రాణం పెడతాడు. మా ఇద్దరి మధ్యా నెలకొన్న బంధుత్వం కన్నా మా స్నేహమే గొప్పది. విలువైనది. ముప్పయ్యేళ్ళనుంచి ఆత్మీయంగా సాగుతున్నది. మా స్నేహం ఆగేది నా మరణం తర్వాతే.

వాడిది ఒక నిర్మాణాత్మకమైన, ఆధ్యాత్మికమైన జీవన విధానం. ఏదో మడి లేదా మైల అనేవి నిత్యం వాడింట్లో గబ్బిలాల్లా వేలాడుతుంటాయి. జీవితం కన్నా జాతకాలనే ఎక్కువ నమ్ముతాడు. ప్రేమిస్తాడు.

ఉదయం దినపత్రిక చేతికి రాగానే, వాడు ముందుగా చూసేది దినఫలాలు. తను ఏ పని తలపెట్టినా, ఆ పని ఏ స్థాయిదైనా సరే ఒక సంప్రదాయ పద్ధతిలో వెళతాడు. వాడు నడిచే ప్రతి అడుగుని గంటల పంచాంగమే నిర్దేశిస్తుంది. నడిపిస్తుంది.

జాతకాలు, నమ్మకాలు వ్యక్తిగతమని నా విశ్వాసం. అంచేత నేనెప్పుడూ వాడి నమ్మకాలలో తలదూర్చను. వాడితో నేను విభేదిస్తే... మా స్నేహం దెబ్బ తింటుంది.

జాతకం అంటే నాకు ప్రకాశం కొడుకు రాఘవ మరణం గుర్తుకొస్తుంది. కొడుకు పుట్టగానే ప్రకాశం ఎంతగా సంతోషించాడో నేను ఇప్పటికీ మర్చిపోలేను. పుత్రోదయం అతడిని ఉత్సాహంగా జాతక ప్రపంచంలోకి తీసుకెళ్ళింది. రాఘవకి జాతకచక్రం వేయించాడు. అంతే ప్రకాశం ముఖంలో వెలుగు ఆరిపోయింది.

నన్ను కావలించుకుని చంటిపిల్లాడిలా ఏడ్చాడు.

జాతక లెక్కప్రకారం రాఘవ మూడేళ్ళకన్నా ఎక్కువ బతకడట!

"ఫూలిష్‌గా మాట్లాడకు. రాఘవ కేమీకాదు. ధైర్యంగా ఉండు" అని వాడిని ఓదార్చే ప్రయత్నం చేశాను. రాఘవ ఆరోగ్యంగా, అందంగా, చలాకీగా పెరుగుతూ హఠాత్తుగా ఏదో చిన్నరోగంతో సరిగ్గా మూడేళ్ళకే చనిపోవడం నన్ను దిగ్భ్రాంతి పరిచింది. రాఘవ చనిపోయిన రోజు మాత్రం ప్రకాశం ఏడ్వలేదు. గత మూడేళ్ళుగా వాడు ఏడ్వని రోజంటూ లేదు. పిల్లవాడు పోయినప్పుడు ఏడ్వటానికి వాడి కళ్ళల్లో కన్నీరంటూ మిగల్తేకదా.

రాఘవ విషాద మరణంతో, మరిక జాతకాల జోలికి ప్రకాశం వెళ్ళడను కున్నాను. లేదు జాతకాలకి మరింతగా అతుక్కుపోయాడు. అందువల్ల నాకేమీ ఇబ్బంది లేదు.

పాతికేళ్ళ తర్వాత జాతకం మళ్ళీ లక్ష్మి పెళ్ళికి అడ్డపడటం నాకు చికాకు కలిగించింది.

లక్ష్మి ప్రకాశంకి ఒక్కొగానొక్క కూతురు. అల్లారుముద్దుగా పెరిగిన కూతురు. పిల్ల ఎంతో అందంగా, లక్షణంగా, బుద్ధిగా ఉంటుంది. బాగా చదువుకుని ఉద్యోగం కూడా చేస్తోంది.

నాకు నా పిల్లలెంతో లక్ష్మి కూడా అంతే. తనకు ఎన్నెన్నో మంచి మంచి సంబంధాలు వచ్చాయి. ఏ ఒక్క సంబంధమూ జాతకాల గేటుని దాటలేక పోయాయి. తలుపు తట్టిన చక్కని అవకాశాలు ప్రకాశం నమ్మకానికి బలి అయిపోవడం తట్టుకోలేక బాధపడ్డాను. కలుగజేసుకోకుండా ఉండలేకపోయాను. ఏం లాభం?

వినిపించుకునే రకం కాదు. వాడి ప్రపంచం వాడిదే.

'లక్ష్మి ఎవర్నయినా ప్రేమించినా బాగుణ్ణు. చడీ చప్పుడు కాకుండా ప్రేమ వివాహం చేసేద్దును' అనుకున్నాను కసిగా. అంతగా ప్రకాశంపై నా ఒళ్ళు మండిపోయింది.

లక్ష్మి అదృష్టం అనుకోవాలి. ఎట్టకేలకు ఒక సంబంధం కుదిరింది. అనగా జాతకం కుదిరింది. ప్రకాశం జాతకాలు చూసే పద్ధతి వేరు. చాలామంది ఫాలో అయ్యే పాస్ మార్కుల పద్ధతి కాదు. పెళ్ళి కుమారుడి జాతకాన్ని ఒక్క పెళ్ళి కూతురుతోనే కాకుండా, మొత్తం కుటుంబ సభ్యులందరి జాతకాలతో సరి చూడటం!

జాతకం కుదిరిన సంబంధానికి కట్నం దగ్గర పేచీ వచ్చింది. కుర్రవాడి జాతకం చాలా బాగుండటంతో కట్నం దగ్గర రాజీ పడ్డాడు ప్రకాశం. అప్పు చేయడానికి సిద్ధపడ్డాడు. పెళ్ళి ఘనంగా చేయాలన్నారు. 'చిత్తం చిత్తం' అన్నాడు ప్రకాశం. ఖరీదైన, విశాలమైన కల్యాణమండపం బుక్ చేశాడు.

***

పెళ్ళి ఘడియలు వచ్చేశాయి. బంధువులంతా వచ్చేశారు. మగపెళ్ళివారు దిగిపోయారు. పెళ్ళిసందడి, హడావుడీ అంతా పార్వతిదే.

రాత్రి పదకొండు గంటల నలభై ఆరు నిమిషాలకు పెళ్ళి. గొప్ప ముహూర్తం. ఆ ముహూర్తానికే ఎన్నో పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాయి. పావు తక్కువ రెండుగంటలకి హఠాత్తుగా రామేశ్వరరావ్ సిక్ అయ్యారు. ఆయన అంతవరకూ ఆరోగ్యంగానే ఉన్నారు. బంధువులతో కబుర్ల మధ్య భోజనం చేశారు. భుక్తాయాసంతో నడుం వాల్చి, ఒక్కసారిగా అస్వస్థతకు గురి అయ్యారు.

రామేశ్వరరావు ఎవరో కాదు ప్రకాశం తండ్రి. నాకు మావయ్య. వయసు ఎనభై సంవత్సరాలు. గుండెల్లో నొప్పి అంటున్నాడే గాని, డాక్టర్ వద్దకు వెళ్ళడానికి ఏమాత్రం ఇష్టపడలేదు. ఆ సమయంలో అక్కడ ప్రకాశం లేదు. నేనే బలవంతంగా ఆస్పత్రిలో జాయిన్ చేశాను.

అంతలో ప్రకాశం కూడా వచ్చేశాడు. వాడి ముఖం తెల్లగా పాలిపోయి వుంది. కళ్ళు మాత్రం నీటి మబ్బుల్లా ఉన్నాయి.

డాక్టర్ సాంబమూర్తి నాకు బాగా తెలుసు. డాక్టర్ గారి అమ్మాయి, మా అమ్మాయి అమెరికా ఫ్రెండ్స్. సాంబమూర్తి హార్ట్ స్పెషలిస్ట్. జనరల్ ఫిజిషియన్ కూడా. ఆస్పత్రి కూడా ఆయనదే.

మంచి డాక్టర్ దొరికినా ఏం లాభం? మావయ్యతో పెద్ద తలనొప్పి అయింది. వైద్యానికి ఏమాత్రం సహకరించలేదు. ఇంటివద్ద వచ్చిన గుండెనొప్పి ఆస్పత్రికి వచ్చేక లేకపోవడంతో మరింతగా మొండికేశాడు.

"రాత్రి నా మనవరాలి పెళ్ళి పెట్టుకుని, ఏ రోగం లేని నన్ను ఆస్పత్రిలో పడేస్తారేమిటి?" అని వాదిస్తాడు మావయ్య.

"జబ్బులేదని మీరంటే ఎట్లా? నన్ను చెక్ చేయనివ్వండి. టెస్టులు కానివ్వండి. మీకు ఏ జబ్బూ లేకుంటే వెంటనే పంపించేస్తాను" అన్నాడు డాక్టర్. ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు మావయ్య.

అంతలో ఒక నర్స్ హడావుడిగా వచ్చి, డాక్టర్‌కి ఏదో చెప్పింది. 'ఇప్పుడే వస్తాను' అంటూ డాక్టర్ నర్స్‌తో పాటు హడావుడిగా గదిలోంచి వెళ్ళిపోయాడు.

ప్రకాశంకి తండ్రిపై చాలా కోపం వచ్చింది.

"నీ మంకు పట్టు చూస్తుంటే అటు నా కూతురు పెళ్ళి జరగనిచ్చేలా లేవు" అన్నాడు. ఏడ్చాడు కూడా.

"నాయిన్నాయినా. అంతమాట అనకురా. కన్నీళ్ళు పెళ్ళిలో ఏమిటిరా? వైద్యం చేయించుకుంటాను" అని ఒప్పుకున్నాడు రామేశ్వరరావు.

మావయ్య వద్ద నేను ఉండటానికి నిర్ణయం జరిగింది.

ప్రకాశం బయల్దేరుతుంటే –

"ఒరే నాయినా. నా గురించి ఆలోచించకుండా పెళ్ళి ఏర్పాట్లు చూసుకో. నన్ను చూడ్డానికి పార్వతమ్మనుగాని, ఏ బంధువుల్నిగాని రానీయకు. ఆస్పత్రి అంటేనే మైల. ముందు నువ్వు ఇంటికెళ్ళగానే చన్నీళ్ళు చెంబుడు నెత్తిపై ఒంపుకుని పెళ్ళి పనుల్లోకి దిగు. అర్థమయిందా" అని సలహా ఇచ్చాడు రామేశ్వరరావు.

ప్రకాశంతో బాటు నేనూ గదిలోంచి బయటకు వెళ్ళాను తనకి ధైర్యం చెబుతూ.

"శ్రీరామ్ నా మనసెందుకో కీడు శంకిస్తోంది. నాన్నకేమైనా అయితే నాకు వెంటనే ఫోన్ చేయి. సందేహించకు. మహా అయితే ఏమవుతుంది. పెళ్ళి వాయిదా పడుతుంది. అందుకు నేను సిద్ధం" అన్నాడు ప్రకాశం.

"అలాంటి ఆలోచనలు చేయకు.మనసు పాడు చేసుకోకు. మావయ్య ఆరోగ్యం కుదుట పడుతుంది. లక్ష్మి పెళ్ళి నిరాటంకంగా. వైభవంగా జరిగి పోతుంది. ధైర్యంగా వెళ్ళు" అన్నాను.

ప్రకాశాన్ని పంపించేశాక నా కాళ్లు పక్కనే ఉన్న క్యాంటిన్ వైపు నడిచాయి. తలనొప్పి, నీరసం. టీ తాగాను. బయటకు వచ్చి సిగరెట్ వెలిగించాను.

గబగబా మెట్లెక్కి రూమ్‌కి వెళ్ళాను. మంచంపై మావయ్యలేరు! నా గుండెలు దడదడలాడాయి. టాయిలెట్‌లో చూసాను. లేరు. ఎక్కడికి వెళ్లారు? నర్సులు ఉండే బల్లవద్దకు పరిగెట్టాను.

"మీరేనా రామేశ్వరరావుకి సంబంధించినవారు. పేషెంట్‌ని ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతే ఎలాగండీ? మాకైనా చెప్పాలి కదా" అంది ఒక నర్స్ కటువుగా.

"ఏమైంది? ఆయన ఎక్కడున్నారు?"

"రూమ్‌లోకి డాక్టరు వచ్చేటప్పటికి రామేశ్వరరావు గారు స్పృహ తప్పి

నేలపై పడి ఉన్నారు. ఐసీయులో చేర్చారు వెళ్ళండి"

మావయ్యను వదిలి బయటకు వెళ్ళడం పట్ల నన్ను నేను తిట్టుకుని ఐసియు వద్దకు పరిగెట్టాను. చాలాసేపటివరకూ నన్ను లోపలికి అనుమతించలేదు. తర్వాత డాక్టర్ సాంబమూర్తి నా వద్దకు వచ్చి లోనికి తీసుకువెళ్ళారు.

మావయ్య ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్నారు.

"హి ఈజ్ డెడ్. మాసివ్ హార్ట్ అటాక్" అన్నాడు డాక్టర్.

నాకు విపరీతమైన దుఃఖం వచ్చింది. మా తండ్రి పోయినప్పుడు కూడా నేనంతగా కుమిలిపోలేదు. నా దిగులు ఒక మంచి మావయ్యను కోల్పోయి నందుకో, లేక ఆయన లక్ష్మి పెళ్ళికి ముందు హఠాత్తుగా చనిపోయినందుకో తెలీదు.

"ఆస్పత్రికి సకాలంలో తీసుకొచ్చి కూడా మావయ్యను బతికించుకోలేక పోయాను డాక్టర్"

"బాధపడకండి శ్రీరామ్‌గారూ. మన చేతుల్లో ఏమీ లేదు. అంతా దైవ నిర్ణయం" అంటూ సాంబమూర్తి నా భుజంపై చేయివేసి నన్ను తన గదిలోకి తీసుకెళ్ళి పోయాడు. కూర్చోబెట్టి చల్లని నీళ్ళు ఇచ్చారు.

ప్రకాశంకి ఫోన్ చేయబోయి ఆగిపోయాను.

సమయం రాత్రి ఏడుఇరవై నిమిషాలు. కాసేపటిలో డిన్నర్. విందు. పెళ్ళి భోజనాల హడావుడి. విందు సమయంలోనే నూతన వధూవరులను ఆహ్వానితులు అక్షింతలు వేసి ఆశీర్వదించే కార్యక్రమం... అర్ధరాత్రి ముహూర్తం మరి.

అలాంటి శుభ సమయంలో చావు వార్తను పెళ్ళిపందిట్లోకి ఎలా చేరవేయ గలను? మావయ్య చావు చాలా బాధకరమైనదే. నలుగురికీ తెలియజేయవలసిందే అయినప్పటికీ జరుగుతున్నపెళ్ళి ఆగిపోవడం ఇష్టం లేదు. మరో అయిదారు గంటల్లో ముగియబోతున్న పెళ్ళి తంతు అర్ధాంతరంగా, అర్థరహితంగా ఆగిపోవడం నాకు ఇష్టంలేదు. మావయ్యను మూలకు తెచ్చి, మంచి రోజులు మొదలయ్యాక, ఎప్పుడో మంచి ముహూర్తం కుదిరేక మళ్ళీ ఇంత ఖర్చుతో, శ్రమతో ఈ పెళ్ళిని జరిపించడం నాకు ఇష్టంలేదు. మనసు అంగీకరించడం లేదు.

మావయ్యను బతికించుకోలేకపోయాను. అది నా చేతుల్లో లేదు. కాని లక్ష్మి పెళ్ళి నా చేతుల్లో వుంది ప్రస్తుతం. మైలకి పెళ్ళి ఆపగలిగే శక్తి వుంటే, ఆగిపోకుండా పెళ్ళిని జరపగల ఆత్మబలం, సత్సంకల్పం నాకుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్మి పెళ్ళి ఆగిపోవడానికి వీల్లేదు. అంతే.

డాక్టర్ సాంబమూర్తిని అందుకు సహకరించమని అడిగాను.

"మా లక్ష్మి పెళ్ళి అయినంతవరకూ రామేశ్వరరావు బతికే ఉన్నట్టు, ఆ తర్వాతే చనిపోయినట్టు నాకోసం మీరొక చిన్న అబద్ధం ఆడాలి" అన్నాను.

సాంబమూర్తి దానికి సమాధానం చెప్పకుండా "మీకు మైలపై నమ్మకం లేనట్టుందే" అన్నాడు.

"నమ్మకం లేకపోయినా, చచ్చినట్టు ఆచరిస్తాను. అదే విచిత్రం. మా కుటుంబంలో మైలను చాలా భయంతో పాటిస్తారు. నేను కాదంటే ఒప్పుకోరు. అంచేత నేను కూడా బుద్ధిగా వాళ్ళను ఫాలో అయిపోతుంటాను. ఈ ఆధునిక కాలంలో మమ్మల్ని, మా నమ్మకాలనీ చూసి విస్తుపోతున్నారా డాక్టర్"

"లేదు శ్రీరామ్. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్... నేను మైలను నమ్ముతాను. ఆచరిస్తాను. నేనేకాదు మా అమెరికా అమ్మాయి కూడా. ఆ విషయం వదిలేయండి. ఇందాక నన్ను పెళ్ళి జరిపించడానికి చిన్న అబద్ధం ఆడమన్నారు. కాని ఎవరూ అబద్ధం ఆడకుండా లక్ష్మి పెళ్ళిని నిరాటంకంగా జరిపించవచ్చు"

"అదెలాగ డాక్టర్?"

"చెబుతాను విను. మీ మావయ్య అనగా రామేశ్వరరావు చనిపోయిన విషయం కేవలం మీరొక్కరికే తెలుసు. అవునా! ఈ చావు వార్త మీరు ఇప్పుడెవ్వరికీ చెప్పకుండా ఏకంగా పెళ్ళి అయిన తర్వాత తెలియజేయవచ్చు. అవతలవాళ్ళకి చావు కబురు చేరిన తర్వాతే మైల అమలులోకి వస్తుంది"

"అంటే సొంత అన్నదమ్ముడికైనా ఏవో కారణాల వల్ల చావు కబురు చేరకుంటే చేరనంత కాలమూ మైల వర్తించదంటారు. అంటే మీరు మైలకీ కమ్యూనికేషన్‌కీ లింకు పెడుతున్నారు. అది సరికాదేమో" అన్నాను.

"మన పూర్వీకులు నెలలు తరబడి కాలినడకన ప్రయాణం చేసి కాశీకి వెళ్ళి వచ్చేవారు. ఆ రోజుల్లో ఎలాంటి కమ్యూనికేషన్ సదుపాయాలు లేవు. తమ ఇంటిపేరు గల బంధువుల ఇంట్లో హఠాత్తుగా సంభవించే చావు లేదా పుట్టుక సమాచారం... యాత్ర ముగించి వూళ్లోకి దిగేవరకూ తెలియని స్థితి. తెలిస్తే మైలతో దైవదర్శనాలు, పూజలూ, అభిషేకాలూ, శివాలింగనాలూ చేయరు కదా. చేస్తే శివుడు కూడా మైలపడినట్టే కదా!"

దీనిపై పెద్దలు క్లారిఫై చేశారు.

"మైలవార్త తెలియక పూజలూ, పుణ్యకార్యాలు, శుభకార్యాలు, పండుగలు వగైరాలు ఏమి చేసుకున్నా తప్పుకాదు. దోషం లేదు. తెలిసి చేస్తేనే తప్పు. కీడు"

అన్నారు.

ఈ రోజుల్లో కమ్యూనికేషన్ ప్రాబ్లెమ్ లేదు. మైల వార్త నిమిషాలలో అవతల వారికి తెలియజేయవచ్చు. అయితే సరిగ్గా, ఆ సమయంలో ఏ గృహప్రవేశమో, ఏ శుభకార్యమో జరుపుకుంటున్నారనుకుందాం. పాపం ఆ శుభకార్యం అర్ధాంతరంగా ఆగిపోకుండా ముగిసిన తర్వాతనే, మైలవార్త వాళ్ళకి చేరేలా చూడటం తప్పు కాదు ఆపద్ధర్మం. సో, శ్రీరామ్‌గారూ, మీ మావయ్య విషయంలో ఈ ధర్మమే ఎందుకు ఆచరించకూడదు? ఆలోచించండి" అన్నాడు డాక్టర్ సాంబమూర్తి.

"అది చాలా రిస్క్ డాక్టర్. ఏ దూర ప్రాంతంలోనో పెళ్ళి అవుతుంటే మీరు చెప్పిన ధర్మం పాటించవచ్చు. మా కేసు వేరు. చావు పక్కనే పెళ్ళి. ప్రకాశం, పార్వతీ బంధువులు. పెళ్ళి పందిట్లో ఉన్నా... వాళ్ళ చూపు, ఆందోళన అంతా ఇక్కడే. మరణవార్త అయిదారుగంటలపాటు పెళ్ళి అయ్యేవరకూ వాయిదా వేయగల పరిస్థితులు కావు. అసాధ్యం. తెలిస్తే ప్రకాశం నా ప్రాణాలు తీసేస్తాడు" అన్నాను.

అర్థం చేసుకున్నాడు డాక్టర్.

"మా కేసుకి చిన్న అబద్ధమే శరణ్యం డాక్టర్. మా మావయ్య పెళ్ళి అయినంత వరకూ బతికి ఉండటం అనివార్యం. పెళ్ళైన వెంటనే చనిపోయినట్లు కాకుండా... ఉదయం అయిదుగంటల ప్రాంతంలో మావయ్య చనిపోవుట... కాదనకండి డాక్టర్ మా లక్ష్మి పెళ్ళి మీ చేతుల్లోనే ఉంది" చేతులు జోడించి డాక్టర్‌కి దండం పెట్టాను.

"శ్రీరామ్! ఒక పెళ్ళి జరిపించడానికి వేయి అబద్ధాలు ఆడొచ్చన్నారు పెద్దలు. అందుకు ఒక స్నేహితుడిగా నేను సిద్ధమే. డాక్టర్‌గా మాత్రం అశక్తుణ్ణి. ఎంచేతంటే ఆస్పత్రి రికార్డులు నిజమే చెబుతాయి. డాక్టర్‌గా దానికి నేను కట్టుబడి ఉండాలి. అది నాధర్మం. అయితే మీకొక సులువు చెబుతాను. మీరు నా పక్కనే వుండి అడిగినవాళ్ళకి నా బదులుగా మీరే అబద్ధం చెప్పేయండి. నేను ఖండించకుండా మౌనంగా ఉండిపోతాను సరేనా" అన్నాడు డాక్టర్.

"అది చాలు డాక్టర్. మిగతాదంతా నేను చూసుకుంటాను" అన్నాను.

"డాక్టర్! పెళ్ళితంతు ముగిసేక మా ప్రకాశం పార్వతి వగైరాలు... ఎవరైనా రావొచ్చు. ఎవరొచ్చినా మావయ్యను చూడటానికి ఐసీయూలోకి ఏ ఒక్కరినీ దయచేసి అనుమతించవద్దు. నాటకం బెడిసి కొడుతుంది" అని ప్రార్థించాను.

"చావుల మీద వ్యాపారం చేస్తున్నామన్న అపకీర్తి ఆస్పత్రులపై ఉంది. అంచేత కేసుని అంతవరకూ రానీయకండి. మీవాళ్లు ఆస్పత్రికి రాకుండా, వచ్చినా శవాన్ని చూడనీయకుండా మీరే చూసుకోవాలి శ్రీరామ్. తప్పదు. మావాళ్ళకీ చెబుతాను లెండి... ఎవరినీ లోనికి రానివ్వవొద్దని".

డాక్టర్ సహకారానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకున్నాను.

"శ్రీరామ్ నీ సాహసాన్ని అభినందిస్తూ, నువ్వు ఆడబోతున్న నాటకం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. ఆల్ ద బెస్ట్" అన్నాడు డాక్టర్ సాంబమూర్తి.

***

భయపడ్డానేగాని, ఇబ్బందులేమీ ఎదురుకాకుండా నాటకం విజయవంతంగా ముగిసింది. ఎనభయ్యేళ్ళ రామేశ్వరరావు మరణం బంధువులందరినీ విషాదంలో ముంచెత్తినా... ముసిలాయన మరణానికి కొన్ని గంటల ముందుగా మనవరాలి పెళ్ళి అయిపోవడం పట్ల అంతా ఊపిరి పీల్చుకున్నారు.

"అక్షింతలు వేయలేకపోయినా...మంచంపై ఊపిరి బిగబట్టి మనవరాలి పెళ్ళి దివ్యంగా, నిరాటంకంగా జరిపించాడు. అంపశయ్యపై తను అనుకున్న సమయానికే ప్రాణం విడిచిన భీష్ముడురా మా నాన్న" అన్నాడు గర్వంతో, కన్నీళ్ళతో ప్రకాశం. నేను చేతులు కట్టుకుని, మౌనం వహించాను.

***

పెళ్ళై మూడు నెలలైనా కాలేదు. లక్ష్మి నుంచి నెల తప్పింది లాంటి శుభవార్త బదులు అనూహ్యంగా పిడుగులా విషాదవార్త. క్రూరమైన రోడ్డు ప్రమాదం. దారుణమైన దుర్మరణం.

ఏక్టివా స్కూటర్‌పై ఆఫీసుకి వెళ్తున్న లక్ష్మిని, వెనక నుంచి బస్సు నిర్లక్ష్యంగా, నిర్దాక్షిణ్యంగా ఢీకొని బలిగొంది. పసుపు పారాణి అరక మునుపే అర్ధాంతరంగా లక్ష్మి జీవితం ముగిసిపోయింది.

తీవ్ర దిగ్భ్రాంతిలో, దుఃఖంలో విషాదంలో మునిగిపోయింది మా కుటుంబమంతా. ప్రకాశం పరిస్థితి చూస్తే... నాకు కన్నీళ్ళు వచ్చాయి. తిండి లేదు. నిద్ర లేదు. శుభ్రత లేదు. మాసిన గడ్డంతో మాసిన బట్టలతో ఒక పిచ్చివాడిగా మారాడు. నేను దగ్గరకు తీసుకుంటే చంటిపిల్లాడిలా, హృదయవిదారకంగా ఏడుపు. నా ప్రకాశాన్ని దక్కించుకునేదెట్లా?

అంతలో, అనూహ్యంగా లక్ష్మి చావు నా మెడకు చుట్టుకుంది!

రామేశ్వరరావు మావయ్య ఎప్పుడు చనిపోయింది గంటలు, నిమిషాలతో

సహా బయట పడిపోయింది. నిజం దాస్తే దాగదు కదా. క్లూ ఎలా దొరికిందో మరి. ఆస్పత్రి రికార్డులూ వగైరా నన్ను ప్రకాశం ముందు దోషిగా నిలబెట్టాయి. అబద్ధం ఆడిన విషయం ఒప్పుకున్నాను.

ప్రకాశం నన్ను కొట్టలేదు. తిట్టలేదు. అసహ్యించుకోలేదు. బంధువుల మధ్య కీడ్చి పంచాయితీ పెట్టలేదు. ఇదంతా వాడి భార్యకు గాని నా భార్యకు గాని చెప్ప లేదు. అలా అని నన్ను వదిలేయలేదు. తన గదిలోకి తీసుకువెళ్ళాడు. లోన గడియ పెట్టాడు. నాకు భయమేసింది.

"శ్రీరామ్ నీవేమీ భయపడకు. నీతో కొన్ని విషయాలు ఒంటరిగా మాట్లాడాల నే ఈ ఏర్పాటు" అంటూ నన్ను ఆస్పత్రిలో జరిగినదంతా ఏ టు జడ్ ఉన్నదున్నట్లు నిజాయితీగా చెప్పమన్నాడు ప్రకాశం.

చెప్పాను. ఆస్పత్రిలో జరిగినదంతా వివరంగా, నిజాయితీగా చెప్పాను. డాక్టర్ సాంబమూర్తి సలహా, సహకారాలతో సహా మొత్తం చెప్పాను. లక్ష్మి పెళ్ళి అర్ధాంతరంగా ఆగిపోకుండా ఆడిన నాటకమంతా చెప్పాను.

ప్రకాశం నాపై విరుచుకుపడిపోతాడనుకున్నాను. లేదు. చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. కళ్ళ నుంచి నీళ్ళు. అలా నిశ్శబ్దంగా ఏడ్చే బదులు నా కాలర్ పట్టుకుని నా చెంప ఛెళ్ళుమనిపించినా, బాగుణ్ణు. నా మనస్సు శాంతించేది. ప్రకాశాన్ని ఎలా ప్రసన్నం చేసుకోవాలో నాకు తోచలేదు.

ఎట్టకేలకు భయంకర నిశ్శబ్దం భగ్నమయ్యింది. ప్రకాశం స్పందించాడు.

"శ్రీరామ్! నువ్వింత డ్రామా అడగలిగావంటే నేనిప్పటికీ నమ్మలేకపోతు న్నాను. షాక్ నుంచి తేరుకోలేక పోతున్నాను. నాకు అర్థంకాని విషయం ఏమిటంటే మానాన్న చావుపైనా, నా కూతురి పెళ్ళిపైనా నిర్ణయాలు తీసుకునే అధికారం నీకెవరిచ్చారు? అంత ధైర్యం ఎలా వచ్చింది?"

చావు బతుకుల్లో వున్న మా నాన్నని నీ చేతుల్లో పెట్టి ఏమన్నాను? పరిస్థితులు బాగోకుంటే, పెళ్ళి ఆపేయడానికి నేను సిద్ధమని చెప్పానా లేదా? మరి నువ్వు చేసిందేమిటి? జాతకాల దగ్గర నుంచి ఎన్నెన్నో, జాగ్రత్తలు తీసుకుని శుభ ఘడియల్లో ఒక పద్ధతి ప్రకారం నా కూతురి పెళ్లిని జరుపుతుంటే మరోవైపు నువ్వు చేసిందేమిటి? మైలను లెక్కచేయకుండా, మూర్ఖంగా ఒక ప్రమాదకరమైన ఎత్తుగడతో కీడు చేసి నా కూతుర్ని మృత్యువుకి అప్పగించేశావు.

మైలను మూటకట్టి మూలన పడేసి, తర్వాత తీరుబాటుగా, ఎప్పుడో ఆ మూట విప్పి అవతల వ్యక్తికి తెలియజేసినప్పటి నుంచే మైల ప్రారంభమవుతుందనే

అజ్ఞాని, అవకాశవాది డాక్టర్ సాంబమూర్తి లాజిక్‌తో నేను ఏకీభవించనప్పటికీ... అతని సలహా నువ్వు పాటించినా కొంత బాగుండేది కదా. వెంటనే ఏవేవో శాంతులూ, పూజలూ శాస్త్రరీత్యా జరిపి, నువ్వు చేసిన పాపానికి నేను లెంపలు వేసుకుని పరిహారమంత్రం జపించేవాడిని కదా. జపాలు, మంత్రాలు కీడుని ఆపలేక పోయినా, దోషం తీవ్రత ఘనస్థితి నుంచి పలచబడి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోకుండా, ఏదో చిన్న అంగవైకల్యంతోనైనా బయటపడి నా కూతురు నాకు దక్కేది కదా అంటే నువ్వు నమ్మవు. నాకు తెలుసు. నా నమ్మకాలను నమ్మని నిన్ను ఎంతగానో నమ్మాను. నీ స్నేహాన్ని నమ్మాను. అదే నేను చేసిన పొరపాటు. అది తెలుసుకునేటప్పటికి అయిపోయింది. అంతా అయిపోయింది" మళ్లీ ఏడ్వటం మొదలెట్టాడు ప్రకాశం.

నాకూ దుఃఖం వచ్చింది. ప్రకాశాన్ని దగ్గరకు తీసుకోబోయాను. చప్పున దూరంగా జరిగాడు.

"వద్దు శ్రీరామ్. వద్దు. నన్ను తాకొద్దు. నువ్వు మైల. నీ మనసు మైల. నీ ఆలోచన మైల. నీ స్నేహం మైల. వద్దు వద్దు నన్ను తాకొద్దు" అంటూ తలుపు గడియ తీసుకుని పరిగెడుతున్నట్టు వెళ్ళిపోయాడు వాడింట్లో నన్ను ఒంటరిగా వదిలేసి!

అలా వెళ్ళిపోయిన ప్రకాశం మళ్ళీ కనిపించలేదు. ఎక్కడికెళ్ళిపోయాడో, ఏమయ్యాడో తెలీదు. రోజులు, నెలలు, సంవత్సరాలు దాటుతున్నా వాడి జాడలేదు. మా చెల్లెలు అనగా వాడి భార్య మా ఇంట్లోనే ఉంటోంది. మొగుడు కనబడకపోవ డానికి కారణం నేనే అని తెలిస్తే ఆమె నా దగ్గరుండునా? ఉన్నా నన్ను బతక నిచ్చునా?

ప్రకాశం నాకెందుకీ శిక్ష విధించాడు?

లక్ష్మి మరణం యాదృచ్ఛికం. మృతాశౌచపు కీడు ఆమెను బలిగొన్నదంటే నమ్మను. అర్థాంతరంగా లక్ష్మి పెళ్ళి ఆగిపోకుండా నడిపిన వ్యవహారానికి ఈ రోజుకి కూడా నేను గిల్టీ ఫీలవ్వటం లేదు. అదే సమయంలో నన్ను నమ్మిన స్నేహితుడి నమ్మకాన్ని, మాటనీ గౌరవించకపోవడం నా తప్పే అనిపిస్తుంది.

నా ప్రకాశాన్ని మిస్ కావడం నన్ను విపరీతంగా బాధిస్తోంది. ఏకాంతంలో చీకటిలో కుమిలిపోతుంటాను. నా బాధను నా భార్యకి చెప్పుకోలేని, పంచుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాను. ఒంటరి జీవినయ్యేను.

ప్రకాశం నాకు కావాలి.

వాడిని స్వామి అవతారంలో వారణాసిలో చూశామని ఎవరో చెబితే వెంటనే రైలెక్కాను. వారణాసిలో పదిరోజులున్నాను. ఆశ్రమాలే కాదు, అన్నిచోట్లా వెదికాను. కనిపించలేదు. తీవ్ర ఆశాభంగంతో ఇంటిముఖం పట్టాను.

ప్రకాశం కనిపించక మూడు సంవత్సరాలు దాటినా... ఎందుకో నాలో ఆశ చావలేదు. వాడు నన్ను క్షమించి నావద్దకు ఏదొక రోజు కచ్చితంగా వస్తాడని చాలా గట్టిగా నమ్ముతున్నాను.

*(నవ్య వీక్లీ - 01.02.2012)*